క్లుప్తంగా

పట్టాలు ఇప్పించాలి..


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

విజయనగరం ఫూల్‌బాగ్: మెంటాడ మండలంలోని ఫారెస్ట్ భూములకు జాయింట్ సర్వే త్వరితగతిన పూర్తిచేసి పట్టాలు ఇప్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరగా పట్టాలు రాకపోవడానికి ప్రభుత్వాల పనితీరే కారణమని ఆరోపించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సోములు పెదరాము, కృష్ణందొర, కృష్ణమూర్తి, జానకీరామ్, రాకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి


చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న థెరపిస్ట్ రాజమోహన్

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఎంఈఓ యుఎస్ఎన్ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులైన చిన్నారులకు ప్రతివారం ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో థెరఫిస్టు రాజమోహన్, ఎంఆర్‌టీలు పాల్గొన్నారు.

సభ్యులుగా చేరండి

- యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి ప్రజలకు సేవలు అందించాలని యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ యాప్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విపత్తులు సంభవించినప్పుడు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సేవలందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్‌నాయుడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు వేయాలంటూ నిరసన


తంగుడిబిల్లి జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును అడ్డగించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల - సతివాడ రూట్‌లో అదనపున బస్సు వేయాలని కోరుతూ విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ మేరకు మండలంలోని తంగుడుబిల్లి జంక్షన్ వద్ద విద్యార్థులు ఆర్టీసీ బస్సును సోమవారం ఉదయం నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బొప్పడాం నుంచి ప్రతిరోజూ వస్తున్న బస్సు తంగుడుబిల్లి జంక్షన్ వద్ద ఆపకుండా వెళ్లిపోతోందని వాపోయారు. బస్సు పూర్తి స్థాయిలో ప్రయాణికులతో నిండిపోతున్న కారణంగా డ్రైవర్ ఆపడం లేదని.. దీంతో చదువులకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్‌పాస్‌లు చేయిస్తున్నప్పటికీ ఉపయోగం లేకపోతోందని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటవాహనాలను ఆశ్రయించి అదనంగా డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నెల్లిమర్ల - సతివాడ రహదారిలో అదనపు బస్సు వేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే తంగుడుబిల్లి ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు కొండవెలగాడలో ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మను కలిసి విద్యార్థుల సమస్యపై వినతిపత్రం సమర్పించారు.

చెట్ల నరికివేతపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామ రెవెన్యూ పరిధి జిరాయితీ భూమిలో గల టేకు, జీడిమామిడి చెట్లు నరికివేసారని కుమిలి గ్రామానికి చెందిన వెల్దాటి రామస్వామి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 399-7లో గల తన సొంత భూమిలో కొంతమంది చెట్లు నరికివేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ప్రజా సంకల్పయాత్రతో...

నూతన అధ్యాయానికి శ్రీకారం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- జగనన్న పాదయాత్రకు ఆరేళ్లు
- వాడవాడలా సంబరాలు



విజయనగరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా రాష్ట్రంలో జగనన్న పాలన కొనసాగుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభమై ఆరు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో కోలగట్ల నివాసంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారన్నారు. ఆ క్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా వాగ్దానాలు చేస్తూ చివరకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. అమ్మఒడి పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు రూ. 15 వేలు జమ చేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పేదవారికి కూడా మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య రంగాన్ని బలోపేతం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకంలో వందలాది చికిత్సలను పొందుపరిచి.. ఆరోగ్యపరంగా ప్రజలు ఇబ్బంది పడకుండా జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలు, రైతులు, యువకులకు అనేక హామీలను గుప్పించి .. చివరకు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా దుర్మార్గపాలన సాగించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం మేనిఫెస్టోను ఎంతో పవిత్రంగా భావించి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ధైర్యంగా వివరించగలిగామన్నారు. పాలకవర్గ సభ్యుల సహకారంతో నగర అందాలను మరింతగా తీర్చిదిద్ది విజయనగరం రూపురేఖలు మార్చగలిగామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయాయాదవ్, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ మోహన్‌రెడ్డి పాలన రోల్ మోడల్..


పూసపాటిరేగ: కేక్ కట్ చేస్తున్న అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన భారతదేశానికే రోల్ మోడల్ అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పాదయాత్రలో అనుభవాలనే మేనిఫెస్టోగా మార్చి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 99 శాతం అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయికులు మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు, టొంపల సీతారాం, దేశెట్టి గణేష్, పి.అప్పడుదొర, కొత్తకోట శ్రీరాములు, సాయి, చాపల సత్తిబాబు, శాంతాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు..

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల


కార్యక్రమంలోమాట్లాడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రికి గుండె నొప్పితో వచ్చే రోగులకు సకాలంలో చికిత్స అందించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు ఆకస్మాత్తుగా గుండె నొప్పితో వచ్చే రోగులకు చేయాల్సిన వైద్యంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ కార్డియాలజిస్టు డాక్టర్ శివదయాల్ మాట్లాడుతూ, ఛాతి నొప్పితో వచ్చే రోగులకు వెంటనే ఈసీజీ తీసి అది గుండె నొప్పా, కాదా అని నిర్ధారించాలన్నారు. అనుమానం ఉన్న కేసుల గురించి వాట్సప్ ద్వారా కేజీహెచ్, ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన వాళ్లకు టర్మొలైజ్ చేసి తదుపరి చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా యాంజియోగ్రామ్ కోసం కేజీహెచ్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ బి. గౌరీశంకర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అనిలాసునందని, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ సుదర్శి, అసోసియేట్ ప్రొఫెసర్ పద్మలత, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ బొంగు పద్మావతి, లక్ష్మీసౌజన్య, ఆదిత్యవర్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్గో సెంటర్‌ను సందర్శించిన ఆర్టీసీ బోర్డు సభ్యుడు


ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్టీసీ బోర్డు సభ్యుడు రాజారెడ్డి

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న కార్గో సేవల కేంద్రాన్ని ఆర్టీసీ బోర్డు సభ్యుడు ఎ.రాజారెడ్డి సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా కేంద్రంలోని సర్వీసుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే సిబ్బంది పనితీరుపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ, కార్గో ఆదాయాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం డిపో, బస్ స్టేషన్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, జోన్ కమర్షియల్ అధికారి అప్పలనాయుడు, పార్వతీపురం జిల్లా ప్రజా రవాణా అధికారి సుధాకర్, కమర్షియల్ ఏటీఎం హెచ్.దివ్య, విజయనగరం, పార్వతీపురం డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి


చింతకాయల వెంకటరావును సత్కరించిన ఎస్పీ ఎం.దీపిక, తదితరులు

- ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపును తీసుకువస్తాయని ఎస్పీ ఎం. దీపిక అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన చింతకాయల వెంకటరావుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలీస్ శాఖలో 39 ఏళ్ల హోంగార్డుగా వెంకటరావు సమర్థవంతంగా పనిచేసి, క్రమశిక్షణతో విధులు నిర్వహించారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐ గోపాలనాయుడు, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రభాకరరావు, హోంగార్డు ఇన్‌చార్జ్ ఆర్ఎస్సై కేశవరావు, హెచ్‌సీలు శ్రీనివాసరావు, రాజు, ఇతర పోలీస్ అధికారులు, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


వక్తృత్వ పోటీలోపాల్గొన్న చిన్నారి

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం, చాసో సాహితీ వేదికలో సుమారు 700 మంది విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా సోమేశ్వరరావు, జక్కు రామకృష్ణ, బీకే బాబూజీ, భైరవభట్ల విజయాదిత్య, చివుకుల శ్రీలక్ష్మి, పీవీఎల్ సుబ్బారావు, రాజేశ్వరరావు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, భోగరాజు సూర్యలక్ష్మి, గురజాడ ఇందిర, సాహితీ, భరద్వాజ చక్రవర్తి, రాజేంద్ర ప్రసాద్ వ్యవహరించారు. విజేతలకు నవంబర్ 30న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీ సహిత బోధన అవసరం

- స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి రమణ


డెంకాడ:అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ప్రతినిధులు రమణ, తదితరులు

డెంకాడ: విద్యార్థులకు టెక్నాలజీ సహిత బోధన జరగాలని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి ఆర్‌వీ రమణ అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం సందర్శించింది. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణపై ఆరా తీయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ట్యాబ్‌లను బాగా వినియోగిస్తున్నందుకు ట్యాబ్ ఇన్‌చార్జ్ ఎ. సరితను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


భోగాపురం: విద్యార్థులకు సూచనలిస్తున్న రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం అధికారి ఆర్‌వీ రమణ

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

భోగాపురం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం అధికారి ఆర్‌వీ రమణ విద్యార్థులకు సూచించారు. భోగాపురం ఆదర్శ పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన పలు పరికరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

10న చెకుముకి టాలెంట్ టెస్ట్


చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాల ల్లో ఈనెల10వ తేదీన చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నామని ఆసంస్థ మండలశాఖ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను తెలిపా రు. సంబంధిత వాల్ పోస్టర్లను స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. నవంబర్ 30న మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను స్థానిక బాలుర ఉన్నత పాఠశా లలో నిర్వహించనున్నట్లు చెప్పారు. హెచ్ఎం బేగం, జన విజ్ఞాన వేదిక సభ్యులు అప్పలనాయుడు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు

గుర్ల: మండలంలోని చింతపల్లిపేటలో రూ.10 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు సర్పంచ్ జమ్ము శ్రీదేవి సోమవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ ఏక గ్రీవం కావడంతో పంచాయతీకి ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నిధులు రూ.10లక్షలు పంచాయతీ ఖాతాలో జమచేసింది.ఈనిధులతో గ్రామం లో సీసీరోడ్లు కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నామని సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవం ట్రయల్ రన్ సక్సెస్


ట్రయల్ రన్‌లో పాల్గొన్న ఆలయ ఈఓ సుధారాణి, ఫిషరీస్ ఎ.డి నిర్మలాకుమారి, ట్రస్ట్ బోర్డు మెంబర్లు

- నేటి సాయంత్రం 4.30 గంటలకు తెప్పోత్సవం ప్రారంభం

విజయనగరం టౌన్: హంస వాహనంపై అమ్మవారు పెద్దచెరువులో విహరించేందుకు సిద్ధమవుతున్నారు. మరికొద్ది ఘడియల్లో సిరుల తల్లి పైడితల్లి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పెద్దచెరువులో 40 మందితో ట్రయల్ రన్ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి, ఫిషరీస్ డీడీ ఎన్.నిర్మలాకుమారి బోటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూసపాటిరేగ మండలం నుంచి 15 మంది గజ ఈతగాళ్లు ఉత్సవంలో పాల్గొంటారన్నారు. తెప్పలో అమ్మవారితో పాటు 16 మంది వరకు పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా మరో మూడు చిన్న బోట్‌లను కూడా వినియోగిస్తున్నట్లు చెప్పారు. అందులో ప్రెస్, ఫైర్, పోలీస్, తదితర శాఖల అధికారులు ఉంటారన్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తెప్పోత్సవం ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై రామగణేష్ , ఆలయ అధికారులు, సిబ్బంది, ట్రస్ట్ బోర్డు మెంబర్లు డాక్టర్ ఎస్. అచ్చిరెడ్డి, బలివాడ కాశీ, పార్వతి, రామ్‌సింగ్ సూరమ్మ, మల్లా వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

వనంగుడిలో వేదసభ...

అమ్మవారు తెప్పలో విహరించడానికి రెండు గంటల ముందు వనంగుడిలో తల్లికి వేదస్వస్తి నిర్వహిస్తారు. సుమారు 30 మంది వేదపండితులు పాల్గొని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉత్సవ రథంపై ఆశీసునులు చేస్తారు.

ఆక్రమణలను తొలగించండి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గోవింద, రైతులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట గ్రామ సమీపంలో ఉన్న లేఅవుట్‌లో ఆక్రమణలు తొలగించి రైతులకు సాగునీరు అందేలా చూడాలని తహసీల్దార్ ధర్మరాజును వైఎస్సార్‌సీపీ నేత లెంక గోవింద, రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవింద మాట్లాడుతూ, గ్రామానికి ఆనుకొని ఉన్న లేఅవుట్‌లో సాగు నీరు ప్రవహించే కాలువలను కప్పేసి రోడ్లు వేశారని, దీంతో పొలాలకు నీరు అందడం లేదన్నారు. ఆక్రమణలు తొలగించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

గో మాంసం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: పట్టణ పరిధిలో అనధికారికంగా ఆవులను వధించి, మాంసాన్ని ఎగుమతి చేసేందుకు సిద్ధపడిన ఇద్దరు వ్యక్తులను రెండు వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, కంటోన్మెంట్ సాయిబాలాజీ పెట్రోల్ బంక్ సమీపంలో ఎగుమతికి సిద్ధం చేసిన 70 కిలోల ఆవు మాంసాన్ని స్వాధీనం చేసుకుని పాగిరి రాము అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అదేవిధంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని షాలిమార్ హోటల్ సమీపంలో ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న 78 కిలోల ఆవు మాంసాన్ని స్వాధీనం చేసుకుని కెల్లి సురేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడుల్లో ఎస్సై ఆర్.గోపాల్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యగిరిలో మెట్లమార్గం నిర్మాణానికి భూమిపూజ


సీసీ రోడ్డు, మెట్ల నిర్మాణపనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రంలో ప్రసిద్ధ శైవ క్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరి కొండపైకి భక్తులు రాకపోకలు సాగించేందుకు మరో ప్రత్యామ్నాయమార్గం నిర్మాణం కోసం పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ నేతృత్వంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు సోమవారం భూమిపూజ చేశారు. దారగంగమ్మలోయ నుంచి పుణ్యగిరి దేవస్థానం వరకు సీసీ రోడ్డు, మెట్ల నిర్మాణ పనులను ఎమ్మెల్సీ దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. ఈప్రతిపాదన గత కొన్ని దశాబ్దాలుగా ఉన్నా ఎవ్వరూ స్పందించలేదు. గతంలో ఎంపీ నిధులు వచ్చినా, ప్రతిపాదిత పనులకు నిధులు చాలవని వదిలేశారు. ఎట్టకేలకు దేవస్థానం చైర్మన్ రామకృష్ణ రోడ్డు పనులు చేయాలని పూనుకున్నారు. దీంతో శివరాత్రి సంబరాల్లో, కార్తీకమాసంలో భక్తుల ఇబ్బందులు తీరనున్నాయి. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, దేవస్థానం బోర్డు డైరెక్టర్లు స్థానిక నాయకులు హాజరయ్యారు.